# కథ

డాక్టర్ ఎస్.వి.రామరాజు

బారెడు పొద్దెక్కింది. సూర్యుడు చిటపటలాడుతున్నాడు. గంగరావిచెట్టు కింద సైకిల్ రిమ్ వంకర తీస్తున్న జానీకి మనసు పనిమీద నిలవడం లేదు. ధ్యాసంతా ఇంటిమీదే వుంది. ఇంట్లో పడుకుని ఏడుస్తున్న బేటా జలీల్ మీదే వుంది. మూడ్రోజుల్నుంచి చెవినెప్పితో ఒకటే ఏడుపు. అది చాలదన్నట్టు రాత్రినుంచి బుకార్(జ్వరం) కూడా మొదలైంది. వెంకటేశ్వర్రావు పిలుపుతో ఆలోచనల్లోంచి ఈ లోకంలోకి వచ్చాడు జాని.

"ఏదో లోకంలో వున్నట్టున్నావు? ఇందాకట్నుంచి పిలుస్తున్నా వినిపించుకోకుండా-

రంజాన్ పండక్కి ఏం ఫలావ్ వండుదామని ఆలోచిస్తున్నావా ఏంటి"- అన్నాడు వెంకటేశ్వర్లు.

"నా పరిస్థితి హలాల్ చేసిన కోడిలా వుంటే ఫలావ్ ఏం వండుతాం? పండగేం చేస్తాం భాయ్?!" అన్నాడు బాధగా జానీ వెంకటేశ్వర్లువంక చూస్తూ.

"అరె! ఏమయింది భాయ్? పొద్దుపొద్దున్నే వేదాంతం మాట్లాడుతున్నావ్? పొద్దున నాస్తా చెయ్యలేదా ఏం? ముఖమంతా పీక్కుపోయి వుంది?! పద అలాపోయి పాపారావు హోటల్లో ఛాయ్ తాగొద్దాం!" అన్నాడు వెంకటేశ్వర్లు.

"తోడీ ధేర్ ఠైరో... ఈ చక్రం బిగించి వస్తానంటూ" బెండు తీసిన చక్రాన్ని సైకిల్‌కి బిగించాడు జాని. టీ కోసం బయలుదేరారిద్దరు.

జానీది చౌరస్తాలో చిన్న సైకిల్ షాపు. ఇంతకుముందు సైకిళ్ళు అద్దెకిచ్చేవాడు. ఈమధ్య సైకిళ్ళు అద్దెకు ఎవ్వరూ తీసుకెల్లడం లేదు. వాటిని అయినకాడికి అమ్మేసి సైకిల్ రిపేరు షాపు పెట్టుకున్నాడు.

ఎన్ని పంచర్లు వేసినా, ఎన్ని టైర్లకు గాలి కొట్టినా, ఎన్ని సైకిళ్ళు వోవరాల్ చేసినా- పాతికా, ముప్పయి రూపాయిలకంటే మిగిలేవి కావు.

ఇక ఆదివారాలు, పండగలపుడు గిరాకీలు అంతంత మాత్రమే!

"ఇప్పుడు చెప్పు అసలేమయింది భాయ్?" అడిగాడు వెంకటేశ్వర్లు టీ చప్పరిస్తూ:

"మొన్న ఇస్కూల్లో పిల్లగాళ్లంతా సీతాఫల్‌కాయలు తిన్నారంట- వాళ్ళలో ఒక పిల్లగాడు మా బేటా జలీల్ చెవిలో సరదాకోసం సీతాఫల్ విత్తనం వేశాడంట! ఖంగారుపడి పరిగెత్తుకుంటూ ఇంటికొచ్చాడు జలీల్. నేనపుడు షాపు దగ్గరే వున్నా. మా బూబమ్మ కంగారుపడుతూ షాపుదగ్గరకొచ్చి విషయం చెప్పింది. జలీల్‌ని వెంటనే R.M.P. డాక్టర్ బాలరాజు దగ్గరకు తీస్కెళ్ళా! అతను ఆ విత్తనాన్ని చిమ్మెటతో తీద్దామని ట్రై చేశాడు కానీ అది ఇంకా లోనికెళ్లిపోయింది. చిమ్మెట చెవిలో ఎక్కడ గుచ్చుకుందో నెత్తురొచ్చింది. అది చూసి కంగారుపడి బేటా ఒకటే ఏడుపు. ఇంక ఏమీ చెయ్యలేక- ఇది నాతో కాదు పట్నంలో చెవి, ముక్కు, గొంతు సంబంధించిన డాక్టర్లుంటారు. వాళ్ళే తియ్యగలరు. నాతోకాదు... అని చావుకబురు సల్లగా చెప్పాడు బాలరాజు!" టీ చివరి గుటక తాగి పక్కన పెట్టాడు జానీ.

"చేతగానివాడు ముందే ఆ ముక్క చెప్పొచ్చుగా అనవసరంగా పిల్లాడ్ని ఏడిపిచ్చాడు" అన్నాడు వెంకటేశ్వర్లు.

"పాపం... అతనేదో సాయం చేద్దామని ట్రై చేశాడు, ఏంచేద్దాం మన ఖర్మ! అదింకా లోనికి పోయింది"- బాధగా అన్నాడు జానీ.

"మరి పట్నం తీసుకుపోలేకపోయావా? అసలే చెవితో పని!" అడిగాడు వెంకటేశ్వర్లు.

"అఁ! అదే పన్జేశా! నిన్న షాప్ బంద్ చేసి బేటా జలీల్‌ని తీస్కొని పట్నం పోయిన. చెవి... ముక్కు డాక్టరు గోవిందాన్ని కలిశా.

పరీక్ష చెయ్యడానికి వంద రూపాయలు తీస్కున్నాడు. చెవిలో గింజ తియ్యడానికి మూడువేలు ఖర్చు వస్తదని చెప్పాడు.

"చిన్న గింజ చెవిలోనుంచి తియ్యడానికి మూడువేల రూపాయలా?" ఆశ్చర్యంతో నోరు వెళ్ళబెట్టాడు వెంకటేశ్వర్లు.

"మత్తు మందిచ్చి తియ్యాలంట! పిల్లగాడు ఓర్చుకోలేడంట! మత్తు మందిచ్చే డాక్టరు వేరే వుంటాడంట- ఆయనకి డబ్బు లియ్యాలంట! ఆపరేషను గదికి, మందులకి, మంచం చార్జీ మొత్తం కలిపి మూడు వేలంట! బాధగా చెప్పాడు జానీ-

"మరీ అంత కక్కుర్తి అయితే ఎట్టా?!

బీదా బిక్కీని చూసి పోవద్దు" అన్నాడు వెంకటేశ్వర్లు.

"మూడు వేలనేసరికి నా గుండె బేజారయ్యింది! వంద తీస్కున్నావ్ గదా దాంతోనే తియ్యండి" అన్నాను బతిమాలుతూ-

"ఛత్! అది ఖాళీ చూసినందుకే ఫీజు- అంతగా డబ్బుల్లేకపోతే గవర్నమెంటాసుపత్రికి జావ్"- అంటూ కోప్పడ్డాడు డాక్టరు.

"ఏదోలా తీయించకపోయావా?" అన్నాడు వెంకటేశ్వర్లు.

"తీయించడానికి మనదగ్గర అన్ని డబ్బులెక్కడివి భాయ్? నేనేంది? నేను చేసే పనేంది? మూడు వేలు నా జిందగీలో ఎప్పుడన్నా చూశానా?"- కొంచెంసేపాగి డాక్టర్‌గారి గదిలోకెళ్లి ఏదోలా తీయండి సారూ అంటూ కాళ్ళమీద పడ్డా..

పైసా తగ్గేది లేదు.. ఇందాకే చెప్పాగా



మీ బోటోళ్ళకి గవర్నమెంటాసుపత్రుంది పోండంటూ" కసిరికొట్టాడా డాక్టరు.

నాకు బుద్ధి లేదు. నిజంగానే. ముందుగా గవర్నమెంటాసుపత్రికెళ్ళుంటే ఆ వందరూపాయలన్నా మిగిలేవి.

"మరి గవర్నమెంటాసుపత్రికెళ్లావా? అక్కడ తీశారా?" కుతూహలంగా అడిగాడు వెంకటేశ్వర్లు.

"అక్కడెందుకు తీస్తారు భాయ్? పేరుకే గవర్నమెంటు అక్కడ కూడా డబ్బులే!-

వాళ్ళకంతకన్నా పెద్ద ఆపరేషన్లున్నాయంట,- వారం రోజుల తర్వాత రమ్మన్నారు". ఇవిగో ఈ తెల్లగోళీలిచ్చి పంపారంటూ లాల్చీ జేబుల్లోంచి టాబ్లెట్లు తీసి చూపించాడు.

పిల్లగాడు చెవినొప్పితో ఒకటే ఏడుపు. ఆడి ఏడుపు చూడలేక

అక్కడ పన్జేసే వార్డుబోయ్ అక్కడ డాక్టరుగారి అడ్రస్ రాసిచ్చాడు.

'గవర్నమెంటు డాక్టరు గదా కొంచెం తక్కువలో చేసుండాలే!' అన్నాడు వెంకటేశ్వర్లు.

"ఆయనేంతక్కువా?- వంద రూపాయలు ఫీజు తీసుకుని గింజ తీయడాన్కి నాలుగువేలు ఫీజవ్వర్దని చెప్పాడు.

"అదేంటి అంతకుముందు డాక్టరు మూడువేలకే తీత్తానన్నాడని చెప్పావుగా?"- అడిగాడు వెంకటేశ్వర్లు.

"ఇతను గవర్నమెంటు డాక్టరు కదా? వేరే వాళ్ళ ఆసుపత్రిలో తియ్యాలంట!- డాక్టరు ఫీజు తక్కువేనంట ఆసుపత్రి ఫీజే ఎక్కువంట!"- అన్నాడు జానీ!

మారు మాట్లాడకుండా ఎర్రబస్సెక్కి ఇంటికి వచ్చా!

"మరయితే జలీల్ చెవిలో విత్తనం అట్టాగే వుందన్నమాట!"- కంగారుగా అడిగాడు వెంకటేశ్వర్లు.

"అవును దాని నొప్పికి... మాకందరికి రెండ్రోజుల్నుంచి ఖానా లేదు... పీనా లేదు...సోనాలేదు..." అన్నాడు బాధగా జానీ!

వెంకటేశ్వర్లుకి ఏంచెయ్యాలో అర్థంకాలేదు.

మూడు వేలంటే మాటలా? వందో రెండొందలో అయితే ఎక్కడన్నా తెచ్చి సర్దవచ్చు. మరీ మూడువేలంటే కష్టమే!

జానీ కొంప గోడు మొత్తం తెగనమ్మినా అంతరాదే? తన పరిస్థితి కూడా అంతంత మాత్రమే! ఎంత ఆలోచించినా ఏమీ పాలుపోవడం లేదు, వెంకటేశ్వర్లుకి.


"ఏం వెంకటేశ్వర్లు? ఇంకో స్ట్రాంగు టీ కొట్టమంటావా? ఇంకా బాగా ఆలోచించుకోవచ్చు!" అన్నాడు పాపారావు ఖాళీ టీ గ్లాసులు తీస్తూ.

"అవును దాని నొప్పికి... మాకందరికి రెండ్రోజుల్నుంచి ఖానా లేదు... పీనా లేదు...సోనాలేదు..." అన్నాడు బాధగా జానీ!
వెంకటేశ్వర్లుకి ఏంచెయ్యాలో అర్థంకాలేదు.
మూడు వేలంటే మాటలా? వందో రెండొందలో అయితే ఎక్కడన్నా తెచ్చి సర్దవచ్చు. మరీ మూడువేలంటే కష్టమే! జానీ కొంప గోడు మొత్తం తెగనమ్మినా అంతరాదే? తన పరిస్థితి కూడా అంతంత మాత్రమే! ఎంత ఆలోచించినా ఏమీ పాలుపోవడం లేదు, వెంకటేశ్వర్లుకి.

"నీకు నవ్వులాటలా వుందిరా! అక్కడ బుడ్డోడు చెవినొప్పితో బాధపడుతుంటే" అన్నాడు వెంకటేశ్వర్లు. జరిగిన సంగతంతా టూకీగా చెప్పి.

"అట్టా అయితే మూడు రూపాయల వడ్డీకి నేనిత్తా! నువ్వు జమానత్ వుంటే" అన్నాడు పాపారావు.

"నిజమే! ఏదోలా పని జరగాలి. ఆకాశం నుంచి డబ్బులు ఊడిపడవు కదా! ఏమంటావ్ జానీ.. జమానత్ నేనుంటా పాపారావు దగ్గర అప్పు






తీసుకో!" అన్నాడు వెంకటేశ్వర్లు.

'ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఎదురుచూసి మోసపోకుమా' రేడియోల్లోంచి వచ్చే పాటనాలకిస్తున్నాడు జానీ!

'ఆ పాటేనా నా మాటేమన్నా ఆలకిత్తావా?' అన్నాడు వెంకటేశ్వర్లు.

"ఆఁ! ఆ! ఆయనిత్తాడు, నువ్వు జమానత్ వుంటావు! బాగానే వుంది. మరి నేనెట్టా తీర్చాలి భాయ్? నేనెంత? నా ఆదాయమెంత? మమ్మల్నందర్ని కట్టకట్టి అమ్మినా అంత డబ్బు రాదే?... వద్దులే... అందులో మూడు రూపాయల వడ్డీ అంటే సంవత్సరం తిరిగేటప్పటికి డబల్ అవుద్ది. నాతో కాదు", బయటికి నడిచాడు జానీ. జానీతో పాటే బయటికొచ్చాడు వెంకటేశ్వర్లు.

"నీవు కాబట్టి మూడు... బయటోళ్ళకయితే వందకి ఐదు..." అన్నాడు హోటల్లోంచి పాపారావు ఇద్దరికి వినబడేలాగా.




అవేమీ విననట్టు పాపు దగ్గర కొచ్చారిద్దరు. అక్కడున్న చెక్కబెంచీ మీద కూర్చున్నాడు వెంకటేశ్వర్లు. అపుడే ఎవరో కాలేజి కుర్రోడు వెనక చక్రం ట్యూబు పంచరైందని హీరో సైకిల్ తీసుకొచ్చాడు. స్టాండువేసి పనిలోకి దిగాడు జానీ.

బూబమ్మ ఏడుస్తూ పాపుదగ్గర కొచ్చింది.

'బద్మా.. సుభసే రోరె... ఖానా నై ఖారే... కుచ్ కరోనా? అనేసి ఏడుస్తూ ఇంటివైపు వెళ్లిపోయింది.

జానీది ఇల్లంటే ఇల్లు కాదు. రోడ్డు పక్కన R & B స్థలంలో పెద్దకాలవ గట్టు పక్కగా రేకులతో షెడ్డు వేసుకున్నాడు. ఎప్పుడు నాటాడో ఇంటిముందున్న నిద్రగన్నేరు చెట్టు పెద్ద మ్రానైంది.

జానీ సైకిల్ టైర్లోంచి ట్యూబు బయటికి తీసి గాలికొట్టి- వెడల్పుగా వున్న ఇనపబొచ్చెలో వున్న నీటిలో దానిని ముంచి ఎక్కడ పంచర్ వుందో పరీక్ష చేస్తున్నాడు. కొంతభాగం నీళ్ళలో ముంచి... తర్వాత ఇంకొంచెం ముంచుతున్నాడు. వాల్ ట్యూబు దగ్గరకు రాగానే చిన్న చిన్న బుడగలు నీటిలోంచి పైకి వస్తున్నాయి. అక్కడే పంచర్ పడింది. అక్కడ గుర్తు పెట్టి, ట్యూబులోనుంచి గాలి తీసేసి గరుకు కాగితంతో అక్కడ రాకసాగాడు. దానిమీద సొల్యూషన్ రాశాడు. పాత ట్యూబులో నుంచి రూపాయి కాసంత రబ్బరుముక్క గుండ్రంగా కత్తిరించాడు. దాన్ని కూడా సేండ్ పేపర్తో రాకి, దానిక్కూడా సొల్యూషన్ పూశాడు. దాన్ని పంచర్ వున్నచోట రాసిన సొల్యూషన్ మీద అతికించాడు. ట్యూబును అటూ ఇటూ వత్తి, టైర్ లోపలపెట్టి గాలికొట్టి కుర్రాడికిచ్చాడు. అతను రూపాయిచ్చి విజిలేస్తూ సైకిల్ తొక్కుకుంటూ వెళ్ళిపోయాడు. ఆ సైకిల్ వెళ్లినవైపే చూస్తూ... చేతిలో రూపాయిని వెంకటేశ్వర్లుకి చూపిస్తూ "ఇట్టాంటి రూపాయిలు ఎన్ని సంపాదిస్తే మూడువేలవుతాయి భాయ్? మరి ఆ పాపారావు వడ్డీ కట్టడానికింకెన్ని సంపాదించాలి!" అన్నాడు జానీ దిగులుగా.

పంచర్ సామాను సర్దుతూంటే ఎందుకో జానీ మొహంలో నవ్వు మెరిసింది.

'భాయ్ నువ్విక్కడే వుండు నేనిప్పుడే వస్తానంటూ" పరుగులాంటి నడకతో ఇంటివైపు వెళ్ళాడు జానీ.

కొంచెంసేపటికి ఏడుస్తున్న జిలానీని భుజాలమీద ఎత్తుకుని తీసుకొచ్చాడు. అతడిని చెక్కబెంచిమీద పడుకోబెట్టాడు.

జానీ ఏం చేస్తున్నాడో నాకు అర్థం కావడం లేదు.

'అరే! భాయ్ పాపారావు హోటల్కెళ్లి ఇద్దరు ముగ్గురు కుర్రాళ్ళను పిల్చుకురా" అన్నాడు వెంకటేశ్వర్లుతో. పాపారావు హోటల్కెళ్లి ముగ్గురు కుర్రాళ్ళను పిలుచుకొచ్చాడు వెంకటేశ్వర్లు ఎందుకు ఏమిటి అని మారుమాట్లాడకుండా.

ఈలోపు సైకిల్ చువ్వకు సొల్యూషన్ రాస్తున్నాడు జానీ.

"మీరంతా బేటా జిలానీని గట్టిగా పట్టుకోండి కదలకుండా, ఈ కుడిచెవ్వు పైకి వుండేలాగా. తల అసలు కదలకూడదు" చెప్పాడు జానీ.

కుర్రాళ్ళు జిలానీ కాళ్ళు, చేతులు గట్టిగా కదలకుండా పట్టుకున్నారు.

వెంకటేశ్వర్లు బెంచి చివర కూర్చుని జిలానీ తలని ఒళ్ళో పెట్టుకుని తలని గట్టిగా పట్టుకున్నాడు కదలకుండా. అప్పటి దాకా గంగరావిచెట్టు మీద అరుస్తున్న కాకి- జరుగుతున్న తతంగం చూసి అరవడం ఆపేసి.. వీళ్ళవైపే చూడ సాగింది.

"ఆంఖే బంద్ కరో బేటా!" కొడుకుతో ప్రేమగా చెప్పాడు జానీ!

భయంతో గట్టిగా కళ్ళు మూసుకున్నాడు జిలాని.

ఈలోపు "క్యా కర్రే! మేరే మున్నాకో"? అంటూ ఏడుస్తూ వచ్చింది బూబమ్మ.

"ఛుప్.. నోరు మూస్కుని ఆ చెట్టు కింద నుంచో పో" అంటూ కోపం చేశాడు జానీ.

మారు మాట్లాడకుండా ఏడుస్తూ.. ఇంటిముందున్న నిద్రగన్నేరు చెట్టు కిందకెళ్ళిపోయింది బూబమ్మ-

ఆమె చూపులన్నీ జిలానీ మీదే వున్నాయి.

"స్టడీ.." అన్నట్టు అందరికీ కళ్ళతోనే సైగ చేశాడు జానీ.

జానీ ఏమి చేయబోతుంది ఎవరికి అర్థంకాక ఒకరి మొహాలొకరు చూసుకుంటున్నారు.

సొల్యూషన్ రాసిన ఇనుప సైకిల్ చువ్వను మెల్లగా జిలాని కుడి చెవిలోనికి పోనిచ్చాడు జానీ... మెల్లగా అది సీతాఫల్ గింజను తాకినంతవరకు పోనిచ్చి.. మెల్లగా బయటికి లాగసాగాడు. ఇనుపచువ్వకు రాసిన సొల్యూషన్కి అంటుకున్న గింజ.. చువ్వతోబాటు బయటికొచ్చింది.

అందరూ సంతోషంతో చప్పట్లు కొట్టారు.

జిలాని కళ్ళు తెరిచి నవ్వుతూ లేచి కూర్చున్నాడు. పరుగు పరుగున వచ్చిన బూబమ్మ కొడుక్కి ముద్దులు పెట్టి ఇంటికి తీసికెళ్లింది. అందరూ మరొక్కసారి జానీని అభినందించారు.

అతనికి రంజాన్ పండక్కి చాంద్ చూసినంత ఆనందం కలిగింది.